జీవిత పరమావధి

ప్రజల్లో ఆవేశం ఉద్రేకం యెక్కువ. ఆవేశం ఉద్రేకం మృగదశనుంచీ వున్న గుణాలవటంవల్లా, జ్ఞానం తరవాత వొచ్చిందవటంవల్లా, ఇప్పటికీ మానవులు తమ సమస్యల్ని ఆవేశంతోనే దిద్దుకోటానికి ప్రయత్నిస్తున్నారు. అందుకనే ప్రజలు ఆవేశపూరితంగా మాట్లాడేవాళ్ళనీ ఉద్రేకపరిచేవాళ్ళనీ చూస్తే సంతోషిస్తారు; అనుసరిస్తారు; నాయకశ్రేష్ఠులుగా పూజిస్తారు.

కాని వుత్త ఆవేశంవల్ల పనులు జరగవు. ఆవేశాన్ని సక్రమ మార్గాల్లో నడిపి, లాభం చేకూర్చటానికి తగ్గ జ్ఞానం కూడా ముఖ్యంగా కావాలి. అయితే మాత్రం ఏంలాభం? గుడ్డి ఆవేశం యెక్కువమందిని ఆలోచించనివ్వదు. ప్రజలను తనకు బానిసలనుగా చేసుకుంటుంది. జ్ఞానాన్ని దగ్గరకు చేరనివ్వదు. అందువల్ల యెంతో నష్టం, నాశనం జరుగుతై.

మన జీవితాల్లో ఎక్కువగా కనిపించే దుర్గుణమే ఇది! మానవుల అభివృద్ధిని ఎక్కువగా ఆటంకపరిచేదే ఇది! దీనివల్లే మన జీవితాలు గంద్రగోళం- అయోమయం అయిపోతున్నై.

ఒకప్పుడు జీవితాన్ని గురించి ఆలోచించుకుంటూ వుంటే అంతా విచిత్రంగా కనిపిస్తుంది. మనం పుట్టాం; బ్రతుకుతున్నాం. ఏక్షణానో ఒక క్షణాన మరణిస్తాం. మనకు

ముందుకూడా ఇదే విధంగా కోటానుకోట్లు పుట్టారు; బ్రతికారు; మరణించారు. ఈ విషయం మనం రోజూ చూస్తూనే వుంటాం—గమనిస్తూనే వుంటాం. కాని 'మనం ఎందుకు పుడుతున్నట్టు? ఎందుకు బ్రతుకుతున్నట్టు? ఎందుకు మరణిస్తున్నట్టు?' అని ఎంతమందిమి ప్రశ్నించుకుంటున్నాం?

చాలా కొద్దిమందిమి.

మనం ఎందుకు పుట్టామో, ఎందుకు మరణిస్తున్నామో తెలుసుకోకపోతే, ఎలా బ్రతకాలో, మన జీవితాన్ని ఏవిధంగా నడపాలో బొత్తిగా అర్థంకాదుగదా! అలాంటప్పుడు తెలుసుకోటానికి ఎందుకు ప్రయత్నించం?

దీనికి అనేక కారణాలున్నాయి. అజ్ఞానం, బద్ధకం, భయం మొదలైనవి. విడివిడిగా వీటిని విచారిద్దాం. ఒక్కొక్క కారణానికి ఒక్కొక్క రకం ప్రజలు అనుచరులుగా వుంటున్నారు గనుక, ఒక్కొక్క రకాన్ని తీసుకొని, వారి భావాలకు కారణాలేమిటో, వాటివల్ల సంఘానికి లాభమో నష్టమో విచారిద్దాం.

చాలామందికి అజ్ఞానంవల్ల ఈ ప్రశ్నలు తట్టవు. ఏదో పుడుతున్నారు; పుడుతున్నారు గనక బ్రతుకుతున్నారు. బ్రతుకుతున్నారు గనక మరణిస్తున్నారు. అంతే! ఏ గొడవా లేకుండా వొచ్చినవాళ్లు వొచ్చినట్లు దాటిపోతున్నారు.

ఈ అజ్ఞానమే భయానికి దారితీస్తుంది. ప్రకృతి చర్యల్ని అర్థం చేసుకోలేకపోతారు. అర్థం చేసుకోటానికి ప్రయత్నించే జ్ఞానం లేకపోవటంవల్ల భయపడతారు. సూర్యుడు రోజూ ఎందుకు తూర్పున ఉదయిస్తున్నాడు?

ప్రపంచాన్నంతా వెలిగించే కాంతి అతని కెక్కడనుంచి వొచ్చింది ? ఆ కాంతి పోతే మానవ సంతతి ఏమయ్యేట్టు ? ఈ ప్రశ్నలకు జవాబులు వాళ్ళకు దొరకవు. వెంటనే వాళ్ళ దృష్టిలో సూర్యుడు భగవానుడయ్యాడు. "ఓ సూర్యభగవానుడా, నీ కాంతిని పోగొట్టుకోక !" అని ప్రార్థనలు సాగినై. చంద్రుడూ యింతే ! చెట్లూ పుట్టలూ ఇంతే ! ఈ లెక్కనే విషజంతువులన్నీ, భయంకర జంతువులన్నీ దేవుళ్ళయి కూర్చున్నైన్న. అజ్ఞానంవల్ల, ప్రశ్నించుకోవటం చేతకాకా, జవాబులు దొరక్క— ఈ రకం యీ విధంగా సంఘాన్ని కొన్నాళ్లు తప్పుదారిని నడిపించింది.

ఈ రకం యిలా వుండగా రెండోరకం మరొకటి వుంది. ఈ రకానికి ప్రశ్నించుకోవటం చాతవునుగాని, జవాబులు ఆలోచించుకోవటం భయం. వీళ్ళకి యీ ప్రశ్నలన్నీ తడతై. వీటికి జవాబులకోసం కూడా ఆలోచిస్తారు—ప్రయత్నిస్తారు. కాని ప్రయత్నించినకొద్దీ చిక్కుల్లో పడతారు. దారీ డొంకా కనపడదు. తమకున్న భయంతో, జవాబులు ఆలోచించుకోలేక, చిక్కులు విడదీసుకోలేక, వేదాంత మార్గంలో పడతారు. మట్టిలో పుట్టాం; మట్టిలోకే పోతాం, అని సమాధాన పరుచుకుంటారు. ఈ సమస్యలు పరిష్కరించుకోలేక, ఎదురుతిరిగే ధైర్యం లేక యీ సమస్యలనుంచీ, లౌక్యరంగంనుంచీ పారిపోతారు. "ఈ ప్రపంచం మిథ్య, మనం మిథ్య, అంతా మిథ్యే !" అంటారు.

అయితే ఈ బ్రతకటమెందుకు ?

ఈ ప్రశ్నకు సమాధానంగా దేవుడు అవసరమౌతాడు. 'మనల్ని యీ మాయలోకంలో దేవుడు పడవేశాడు. ఆ దేవుణ్ణి చేరి తరించటానికి యీ జన్మలో మనం సాధనం చెయ్యాలి,' అంటారు. దీంతో లౌకిక వ్యవహారాలలో జోక్యం లేకుండా చేసుకోవటం, లౌకికచింతే నీచమను కోవటం, పరమార్థంకోసం ముక్కు మూసుకోవటం జరుగు తుంది. అంటే మనం యీ లోకంలో చేసేది ఏమీ లేదు గనక బ్రతుకునే చావుగా మార్చుకుందామనే స్థితికి వొస్తుంది ప్రపంచం. పొట్టకు సంపాదించుకోవటం, కడుపునిండా తినటం మొదలైన అవసరాలే తప్పయిపోయి, కోర్కెలను అరికట్టటం ఇంద్రియాలను జయించటం, దేవుని పిలుపుకోసం ఊర్ధ్వ దృష్టిని అలవరచుకోవటం ఆదర్శాలవుతవి.

ఈ పరిస్థితుల్లో మానవులకు మరో ప్రశ్న తట్టింది. దేవుడనే వొకడుంటే యీ లోకంలో యిన్ని ఘోరా లెందుకు జరుగుతున్నాయి ? ఈ హెచ్చు తగ్గులకు కారణం ఏమిటి ? సన్మార్గులు బాధపట్టం, దుర్మార్గులు సుఖపట్టం ఎందుకు జరుగుతూవుంది ?

ఈ ప్రశ్నలకు జవాబుగా కర్మసిద్ధాంతం, స్వర్గనర కాలూ సృష్టించబడ్డవి. "అదంతా మన ఖర్మ ! గీత తప్పు తుందా !" అనే జవాబు, విమర్శించుకొని జవాబు చెప్పలేని ప్రతి ప్రశ్నకూ ఈ వేదాంతులు అడ్డం పెడతారు.

మరొకప్పుడు, "ఈ లోకంలో దుర్మార్గులు తప్పిం చుకు పోయినా నరకంలో శాస్తి అనుభవిస్తారు. సన్మార్గులకు తగిన పూజలు ఇక్కడ జరక్కపోయినా స్వర్గంలో సుఖం

అనుభవిస్తాడు" అని చెప్తారు. మన వేదాంతం అంతా ఈ విధంగా వృద్ధిచెందిందే! ఎంతసేపూ, "బాహ్య ప్రపంచంతో ఏమీ సంబంధం పెట్టుకోకు, లోపలకు చూసుకో" అని చెప్తుంది. దీన్ని ప్రజలకు గొప్పగా కనపట్టానిగ్గాను "ఆత్మజ్ఞానం అంటుంది.

అజ్ఞానంవల్ల అభివృద్ధిని ఆటంక పరచినదానికంటే ఈ సిద్ధాంతం చాలా ప్రమాదకరమైంది. ఈ వేదాంతి తన జ్ఞానాన్ని ప్రజలను తప్పు మార్గాలను పట్టించటానికి వినియోగిస్తాడు. మానవులు కావాలనేవన్నీ తానూ కావాలంటూ "వీటివల్ల ప్రయోజనం లేదు" అని చెప్తాడు. "మనం వీటిని సాధించుకోలేం" అని నిరుత్సాహపరుస్తాడు. ఈమధ్య నాకూ నా స్నేహితుడికీ ఈ దిగువ సంభాషణ జరిగింది. ఆ సంభాషణ సరిగ్గా ఈ తత్వాన్ని విశదీకరిస్తుంది గనక ఇక్కడ పొందుపరుస్తున్నాను :—

"ఎందుకొచ్చినవండీ ఈ మాటలు?" అన్నాడు.

"మనం అభివృద్ధి చెందటం మీకు యిష్టంలేదా?" అని అడిగాను.

"ఇష్టంలేకేం! పరిశ్రమలు కావాలి. శుభ్రమైన భోజనం కావాలి! అజ్ఞానం పోవాలి! ఐకమత్యం కావాలి"

"ఇంకేం? అందుకు ప్రయత్నిద్దాం!" అన్నాను.

"ఏమీ లాభంలేదు. మనవల్ల ఏమీ జరగదు."

"ఎందుకు జరగదు?"

"ఎలా జరుగుతుంది? మనకంటే పెద్ద పెద్దవాళ్ళే ప్రయత్నించారు. వాళ్ళేం నెగ్గారు?" అన్నాడు.

ఇదీ వరస. ఈ రకం మనకు అభివృద్ధి అక్కర్లేదన్నే అమాయకులకు నచ్చేటట్టుగా, ఈ విధంగా (బహుశా తమకు తెలియకుండానే) ప్రచారం చేస్తూ వుంటారు. అంతేగాని ఒకప్పుడు బ్రహ్మాండ రుద్రుడు చెయ్యలేని పని కొన్ని పరిస్థితుల్లో స్వల్ప మానవుడు కూడా చెయ్యగలుగుతాడని వీళ్ళకు తెలియదు. మనలాంటివాళ్లు యిలా వేదాంతం మాట్లాడబట్టే పెద్ద పెద్దవాళ్లు కూడా ఏమి చెయ్యలేక పోయారని తెలియదు.

ఈ రకంలోనే మరొక తెగవుంది. ఈ తెగకూడా జీవితాన్ని ఎదుర్కోలేని మానవ హృదయ దౌర్బల్యాన్నే సూచిస్తుంది. ఈ ప్రపంచంలో మనం చెయ్యగలిగిందిగానీ, చెయ్యవలసిందిగానీ లేదనే బోధిస్తుంది. ప్రపంచంలోని సమస్యల్ని మనం పరిష్కరించలేమనే చెపుతుంది. కాని ఈ తెగకు దేవుళ్ళో నమ్మకం లేదు. అందుకని పై తెగ ముక్కుమూసుకొని కూర్చుందామని చెబితే ఈ తెగ 'రేపు మనది కాదు; తిని తాగి తందనాలాడదాం' అని చెపుతుంది.

ఈ సిద్ధాంతం ముఖ్యంగా యువకులను బాగా ఆకర్షిస్తుంది. ఇంతకంటే ఇంకేం కావాలి? కాని ఇది ఎలా నెరవేర్చుకోవటం? అని ఆలోచిస్తేమాత్రం దీని బండారం బయట పడుతుంది. అంతా తిని తాగి తందనాలాడితే ఉత్పత్తిచేసే దెవ్వరు? ఎక్కువ ఉత్పత్తి లేకుండా ప్రతి వాడూ తిని తాగి తందనాలాట్టం ఎలా జరుగుతుంది?

ఎవరు తిని తందనాలాడాలి? ఎవరు ఉత్పత్తి చెయ్యాలి? తిని తాగి తందనాలాట్టానికి సరిపోయే అంతగా ఉత్పత్తి చేసే విధానం ఏది ?

ఈ సంగతులన్నీ వీళ్ళు ఆలోచించరు. వినగానే హాయిగావుండే మాటలని తృప్తి పొందుతారు. ఆవేశమే ప్రధానంగా పెట్టుకున్న జనం, జీవితంలో ఆశాభంగాలు పొందిన జనం ఈ మాటలకు నోరూచ్చుకొని వెంటపడుతుంది. ఈ తెగ డబ్బున్న నలుగురి సంగతేగాని ప్రజల సంగతి ఆలోచించరు. వీరి వాదంలో సంఘీభావానికే చోటులేదు. వీరి వాదం, మొత్తంమీద సంఘం ఎలా బాగుపడుతుందో చెప్పదు. డబ్బు పుష్కలంగావున్న వ్యక్తులు ఏ విధంగా తమ్ము తాము నాశనం చేసుకొని, సంఘానికి ఏవిధంగా అపకారం చెయ్యాలో మాత్రమే ఈ సిద్ధాంతం నేర్పుతుంది.

పాదుషాలవల్లా, జమీందార్లవల్లా ఇంతకంటే ఎక్కువేమి జరిగింది ? తిని, కడుపు జలవంతంగా ఖాళీ చేసుకొని, మళ్ళీ తిన్నవాళ్ళని గురించి మనం విన్నాం. వీళ్ళవల్ల సంఘానికి ఏమిలాభం చేకూరింది ?

వీటన్నిటికంటే మేరీ కారెల్లీ పాత్రలాగు 'భగవంతుడు ఉంటే అతన్ని త్వరగా పొందాలి; లేకపోతే అసలు జీవితమే అనవసరం' అనుకొని ఆత్మహత్య చేసుకోవటం మంచిది కాదూ ?

ఇక ప్రజల్లోవున్న ఆఖరి రకాన్ని గురించి చెప్తాను.

ఈ రకం మానవసంఘంలో, సంఖ్యలో తక్కువదీ, ఆదర్శంలో గొప్పదీ! ఈ రకం కార్యాచరణకు అందని

వ్యూహాలను వ్యూహించదు. అందని వ్యూహాలు వ్యూహించి, భంగపడి అసంతృప్తివల్ల వేదాంతమార్గంలో పడదు. 'మన వల్ల ఏమవుతుంది?' అని నిస్పృహ చెందదు. పరిస్థితులను అనుకూలంగా సంఘాభివృద్ధికి పాటుపడుతుంది.

ఈ రకానికి సంఘాభివృద్ధికి పాటుపడాలనే వాంఛా, ఆ వాంఛను ఆచరణలో పెట్టే శాస్త్రజ్ఞానం రెండూ వుంటాయి. ముఖ్యంగా వాంఛ వుంటే శాస్త్రజ్ఞానంకోసం ప్రయత్నిస్తాం. ఈ రెండూ లేకపోతే లాభం లేదు.

Bentham ఇలా వ్రాశాడు—'A person who always acted with a view to his own maximum satisfaction in the long run would always act rightly.' కుటుంబరావు కూడా స్వార్థం అనే కథలో ఇల్లాంటి అభిప్రాయాన్నే వెలిబుచ్చాడు. కాని నేను వొప్పుకోను. నిరంకుశంగా రాజ్యాలు ఏలినవాళ్ళంతా ప్రపంచానికి లాభాన్నే చేకూర్చారా?

తల్లికి బిడ్డ జబ్బు నయం అవ్వాలనే వాంఛ వుంటుంది. కాని తగిన శాస్త్రజ్ఞానం లేకపోవటంవల్ల మందులకు బదులు ముడుపులు కట్టి ప్రాణంమీదికు తెస్తుంది. సంఘాన్ని బాగు చెయ్యాలనే వాంఛ లేకుండా శాస్త్రజ్ఞానంవున్నా యింతే జరుగుతుంది. ఆ శాస్త్రజ్ఞానం మానవ నాశనానికి వినియోగ పడుతుంది. దీనికి హిట్లరే తార్కాణం.

పై తరగతికి ఈ రెండు లక్షణాలూ వున్నాయి గనక వెనకచూపు లేకుండా మానవ శ్రేయస్సుకి పాటుపడుతుంది. అంత మాత్రాన ఈ వర్గానికి స్వార్థంలేదు అనుకోగూడదు. తమ సుఖం సంఘాభివృద్ధిమీదే ఆధారపడి వుంటుందనీ

సంఘానికి భిన్నంగా ఒక వ్యక్తి సుఖపడలేడనీ తెలుసుకొని పాటుపడతారు. ఎలాగూ మనం బ్రతకటమనేది తప్పదు గనకా, మన తర్వాత కూడా మానవులు బ్రతుకుతూనే వుండాలి గనకా, ఈ ప్రపంచాన్ని మానవవాసయోగ్యం చెయ్యటానికి ప్రయత్నిస్తారు. మానవులు ఎక్కువమంది సుఖపట్టానికి వసతులు కల్పిస్తారు.

నేను ఈ మాట చెప్పినప్పుడు 'సుఖపట్టం అంటే ఏమిటి ?' అనే ప్రశ్న వొస్తుంది. అనేకమంది అనేక రకాలుగా సుఖపడతారు. ఒకరికి సుఖమిచ్చింది మరొకరి కివ్వదు. ఒకరికి సుఖాన్నిచ్చిన సిద్ధాంతమే మరొకరిని బాధపెడుతుంది. కనక సుఖం అంటే ఎలా తేలుతుంది ? దేన్ని సుఖంగా పెట్టుకుని మానవులు కృషి చెయ్యాలి ?

ప్రపంచంలో అనేక సమస్య లున్నమాట నిజమే. ఒక్కొక్క సమస్యా పరిష్కారం ఒక్కొక్క తరగతికి సుఖాన్నిచ్చే మాటా నిజమే ! కాని అన్ని సమస్యల్ని ఒకేసారి మనం పరిష్కరించలేం. అప్పటి పరిస్థితుల్లో ప్రజా సామాన్యాన్ని ఎక్కువ కలవరపరిచే సమస్యనే పరిష్కరించ ప్రయత్నించాలి. అటువంటి సమస్యనే పరిష్కరించగలం. మరొక సమస్యకు ప్రజలు సహాయం చెయ్యరు; పరిష్కారానికి తెగించి పోట్లాడరు. ఏ సమస్య తమ్ము ఎక్కువగా హింసిస్తూ వుందో, ఆ సమస్యను పరిష్కరించుకోటానికే ప్రజలు తాపత్రయపడతారు. ప్రస్తుతం ప్రజలను ఎక్కువగా కలవరపెట్టే సమస్య ఆర్థిక సమస్య. ఈ సమస్యా పరిష్కారం కోసం ప్రజలు ఉద్రిక్తులై వుంటారు. తమ్ము బాధించే ఈ